క్లుప్తంగా

జైనూర్ సీఐగా మల్లేశ్


బాధ్యతలు స్వీకరిస్తున్న మల్లేశ్

నార్నూర్: జైనూర్ పోలీస్‌స్టేషన్‌లో నూతన సీఐగా జి. మల్లేశ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మండల కేంద్రంలో విధులు నిర్వహించిన రామకృష్ణ ఉట్నూర్‌కు బదిలీ అయ్యారు. వారి స్థానంలో జి.మల్లేశ్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సీఐని ఎస్సై మధుకర్, సిబ్బంది సన్మానించారు.

గోరింటాకు వేడుకలు


గోరింటాకుతో మహిళలు

దహెగాం: ఆషాఢమాసం పురస్కరించుకుని మండల కేంద్రంలో మాజీ ఎంపీపీ చిలువేరు కల్పన ఆధ్వర్యంలో మహిళలు బుధవారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. ఆషాఢ మాసంలో మహిళలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోంది. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి


మొక్కలు నాటుతున్న ఎంపీపీ

కెరమెరి: ప్రతీ ఒక్కరు మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. బుధవారం మండలంలోని అంతాపూర్ గ్రామపంచాయతీలోని వివిధ గ్రామాల్లో హరితహారం మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ వనాలు పెరగాలంటే ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలని, పర్యావరణ రక్షణకు కృషిచేయాలని పేర్కొన్నారు. ఆయన వెంట ఎంపీటీసీ సకారాం, బీఆర్‌ఎస్ నాయకులు ఉత్తం నాయక్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో పఠనాసక్తి పెంచాలి


విద్యార్థితో చదివిపిస్తున్న రమేశ్

కెరమెరి: విద్యార్థుల్లో పఠనాసక్తిని పెంచాలని గోయగాం కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు నల్లగొండ రమేశ్ అన్నారు. బుధవారం మండలంలోని ప్రాథమిక పాఠశాల కొఠారి, రాంనగర్, కల్లెగాం, రింగన్‌ఘాట్‌లను సందర్శించారు. విద్యార్థుల హాజరును పరిశీలించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం వడ్డించాలని పేర్కొన్నారు. విద్యార్థులతో బోర్డుపై అక్షరాలు రాయించడంతో పాటు చదివించారు. హెచ్‌ఎంలు సరిత, కిరన్మయి, దివ్యశ్రీ, రతన్, ఉపాధ్యాయుడు కిషన్ ఉన్నారు.

వెలవెలబోతున్న వసతి గృహాలు

- పాఠశాలలు ప్రారంభమైనా రాని విద్యార్థులు
- తల్లిదండ్రులకు ఫోన్లు చేస్తున్న వార్డెన్లు


కౌటాల కేజీబీవీ

కౌటాల: పేద విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు సకల సదుపాయాలతో వసతి సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పిస్తోంది. వసతి గృహాలు పేద పిల్లలకు వరంలా మారాయి. వసతి గృహాల్లో 3 నుంచి 10వ తరగతి బాలబాలికలకు వేర్వేరుగా హాస్టల్ వసతి, నోటు పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు అందజేస్తున్నారు. కానీ ఈఏడాది ఇంకా పూర్తిస్థాయిలో విద్యార్థులు హాస్టళ్లలో చేరలేదు. మండలంలోని మొగడ్‌దగడ్‌లో గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహం, కౌటాలలో బీసీ బాలుర వసతి గృహం, కస్తూర్బా గాంధీ బాలిక వసతి గృహాలు ఉన్నాయి. ఈనెల 1 నుంచి 9వరకు బడిబాటలో భాగంగా వసతి గృహాల్లో ప్రవేశాల కోసం ప్రచారం చేసినా విద్యార్థులు ఆశించిన స్థాయిలో హాస్టళ్లలో చేరలేదు. వసతి గృహాలు ప్రారంభమై 15 రోజులు దాటినా విద్యార్థులు రాకపోవడంతో వెలవెలబోతున్నాయి.

15 రోజులు దాటినా..

వసతి గృహాలు, పాఠశాలలు పునఃప్రారంభమై 15 రోజులు గడిచినా పదుల సంఖ్యలో మాత్రమే విద్యార్థులు హాస్టళ్లలో చేరారు. దీంతో విద్యార్థుల రాక కోసం ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు. జూన్12న పాఠశాలలు పునఃప్రారంభం కాగా ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది జూన్ 22 వరకు 45 డిగ్రీల పగటి ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండలు మండిపోవడంతో తల్లిదండ్రులు విద్యార్థులను వసతి గృహాలకు పంపించలేదు. కాగా గత మూడు రోజులుగా ముసురు పడుతుండడంతో విద్యార్థులు హాస్టళ్లలో ఇంకా చేరలేదు. విద్యార్థులు పూర్తిస్థాయిలో వసతి గృహాలకు రాకపోవడంతో జిల్లా ఉన్నతాధికారులు వార్డెన్లపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వంద శాతం విద్యార్థులు హాస్టళ్లకు వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు ప్రతీ విద్యార్థి తల్లిదండ్రులకు ఫోన్ చేసి హాస్టళ్లకు పిల్లలను పంపాలని, తరగతులు ప్రారంభిస్తున్నామని చెబుతున్నారు. పత్తి విత్తనాలు వేసిన అనంతరం విద్యార్థులను హాస్టల్‌కు పంపిస్తామని పలువురు తల్లిదండ్రులు సమాధానం ఇచ్చారని ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.

పదుల సంఖ్యలో హాజరు..

వసతి గృహాలకు విద్యార్థులు ఇంకా రాకపోవడంతో వార్డెన్లు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని మొగడ్‌దగడ్‌లో గిరిజన ఆశ్రమ బాలుర వసతి గృహంలో 150 మంది విద్యార్థులకు 45 మంది విద్యార్థులు మాత్రమే వచ్చారు. పాఠశాలలో 40 మంది పదో తరగతి విద్యార్థులకు గాను కేవలం 10 మంది మాత్రమే హాజరయ్యారు. కౌటాల బీసీ బాలుర వసతి గృహంలో 87 మందికి 30 మంది, కౌటాల కస్తూర్బా గాంధీ బాలిక వసతి గృహంలో 200 మంది విద్యార్థులకు 55 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. ప్రతీరోజు విద్యార్థులకు ఫోన్లు చేస్తున్నామని, విద్యార్థులు వారం రోజుల్లోగా హాస్టళ్లకు రావాలని కేజీబీవీ ఎస్‌వో పవిత్ర అన్నారు.

ఐదేళ్లయినా.. అనుమతులేవి?

- నిలిచిన బీటీ రోడ్డు నిర్మాణం
- 2018లో నిధులు మంజూరు
- అటవీ అనుమతులు లేక బ్రేక్


కర్జి నుంచి మొట్లగూడ వరకు ఉన్న మట్టి రోడ్డు

దహెగాం: ఐదేళ్ల క్రితం మంజూరైన మొట్లగూడ బీటీ రోడ్డు నిర్మాణానికి మోక్షం కలగడం లేదు. మారుమూల గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం కింద నిధులు మంజూరు చేస్తోంది. ఇందులో భాగంగా 2018లో కర్జి నుంచి రాంపూర్ మీదుగా మొట్లగూడ వరకు 14 కిలోమీటర్ల బీటీ నిర్మాణానికి రూ. 6.25 కోట్లు మంజూరయ్యాయి. కానీ ఇంతవరకు పనులు జరగలేదు.

శిలాఫలకంతో సరి..

నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు ముందుకు సాగడం లేదు. రోడ్డు మధ్యలో అడవి ఉండడంతో అటవీశాఖ అనుమతులు ఇవ్వలేదు. దీంతో బీటీ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది. బీటీ నిర్మాణం కోసం శిలాఫలకం వేసి ప్రజాప్రతినిధులు రోడ్డు పనులు ప్రారంభించారు. అంతకు మించి పనుల్లో ఎలాంటి పురోగతి లేదు. కర్జి నుంచి రావులపల్లి క్రాస్‌రోడ్డు వరకు అటవీ ప్రాంతం ఉండడంతో పనులు నిలిచిపోయాయని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కర్జి అవలివైపు రాంపూర్, రావులపల్లి, మొట్లగూడ, టేపర్‌గాం, శంకరపురం గ్రామాలు ఉన్నాయి. ఆయా గ్రామాల్లో అధికంగా గిరిజనులు నివసిస్తున్నారు. బీటీ రోడ్డు మంజూరైందని సంబరపడ్డ గిరిజనులు ఐదేళ్లుగా రోడ్డు నిర్మాణానికి ఎదురు చూస్తున్నారు. ఎన్నోమార్లు స్థానిక అధికారులకు, నాయకులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు.

పులి సంచరించే ప్రదేశం..

కర్జి నుంచి రాంపూర్ వరకు దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ ప్రాంతంలో పులి సంచారం ఉన్నందునే అటవీ శాఖ అధికారులు బీటీరోడ్డు నిర్మాణానికి అనుమతులు ఇవ్వడం లేదని పలువురు చెబుతున్నారు. అడవి లేని చోట రావులపల్లి ఎక్స్ రోడ్డు నుంచి మొట్లగూడ గ్రామం వరకు కేవలం 1.5 కిలోమీటర్ల వరకు మాత్రమే బీటీ రోడ్డు పూర్తయిందని పలువురు పేర్కొంటున్నారు. బీటీ రోడ్డు లేనందున వర్షాకాలంలో కర్జి నుంచి రావులపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద వరకు మట్టిరోడ్డంతా బురదగా మారుతోంది. సరైన రోడ్డు లేక వైద్యం కోసం ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. కర్జి ప్లాంటేషన్ వద్ద రెండేళ్లుగా రోడ్డు కోతకు గురై రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని వాపోతున్నారు.

అనుమతులు రాగానే పనులు చేపడుతాం

కర్జి నుంచి రాంపూర్ మీదుగా మొట్లగూడ వరకు బీటీ నిర్మాణం కోసం 2018లో రూ.6.25 కోట్లు మంజూరయ్యాయి. రావులపల్లి ఎక్స్‌రోడ్డు నుంచి మొట్లగూడ వరకు 1.5 కిలోమీటర్ల మేర బీటీ కూడా పూర్తయ్యింది. మిగతా 12.5 కిలోమీటర్ల వరకు అడవి ఉన్నందున అనుమతుల కోసం నివేదికలు పంపించాం. అనుమతులు రాగానే రోడ్డు పనులు చేపడుతాం.

\- రామ్మోహన్, పీఆర్ ఈఈ

సీఎం సభకు తరలిరావాలి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు


కండువాలు అందజేస్తున్న ఎంపీపీ మోతిరాం

వాంకిడి: జిల్లా కలెక్టరేట్ కార్యాలయంతో పాటు వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడానికి ఈనెల 30న జిల్లా కేంద్రానికి సీఎం కేసీఆర్ రానున్న నేపథ్యంలో ఏర్పాటు చేసే బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులతో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు సభకు వచ్చేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అజయ్ కుమార్, సర్పంచులు, ఎంపీటీసీలు తదితరులు ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించే సీఎం కేసీఆర్ సభకు భారీగా ప్రజలు తరలిరావాలని ఎంపీపీ పెందోర్ మోతిరాం అన్నారు. బుధవారం ముకదంగూడ, అంతాపూర్, భోలాపటార్, పరంధోళి గ్రామ పంచాయతీల్లోని వివిధ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఆయా గ్రామాల ప్రజలకు కండువాలు అందజేశారు. మండలం నుంచి సుమారు 5వేల మందిని తరలించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు శివాజీ, సంతోష్, సాగర్‌బాయి, బాలాజీ, సకారాం, భరత్ తదితరులు ఉన్నారు.

కౌటాలలో..

కౌటాల: జిల్లాలోని మాలి కులస్తులు సీఎం కేసీఆర్ సభను విజయవంతం చేయాలని మాలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదే వసంత్‌రావ్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని మాలి సంఘం భవనంలో మండల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేసీఆర్ మాలీలకు ఎస్టీ హోదా కల్పించాలని అసెంబ్లీలో తీర్మానం చేశారని గుర్తు చేశారు. జిల్లాలోని మాలి కులస్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. సంఘం మండలాధ్యక్షుడు నికాడే గంగారం, సర్పంచులు ఆదే శ్రీనివాస్, మోర్లె రమేశ్, నాయకులు నాందేవ్, బాపురావ్, శ్రీనివాస్, నారాయణ, నరేంద్, హన్మంతు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు

నార్నూర్: కార్యకర్తలే బీఆర్‌ఎస్ పార్టీకి పట్టుకొమ్మలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవ్‌రావు అన్నారు. జైనూర్ మండల కేంద్రంలో బుధవారం ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఇంతియాజ్ లాలాతో కలిసి కార్యకర్తలు, ప్రజాప్రతినిధులతో ప్రత్యేక సమావేశమయ్యారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 30న నిర్వహించే సీఎం సభకు ప్రతీ పంచాయతీ నుంచి ప్రజలను తరలించాలని సూచించారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ లక్ష్మణ్, సర్పంచుల సంఘం మండల అధ్యక్షుడు భీంరావు, సహకార సంఘం చైర్మన్ హన్నుపటేల్, సర్పంచులు రాహుల్, గోవింద్‌రావు, రాము, నాగోరావు, నాయకులు అంబాజీ, లక్ష్మణ్, మోహన్, ప్రకాశ్, సతీశ్ సమాధన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభం


రికార్డులు పరిశీలిస్తున్న ఎంపీపీ

ఆసిఫాబాద్‌అర్బన్: మండలంలోని వావుదం గ్రామపంచాయతీ పరిధిలోని ఆదర్శ అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో గర్భిణీలు, చిన్నారులు, బాలింతలకు మెరుగైన సేవలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ అలీబిన్ అహ్మద్, సర్పంచ్ బాబురావ్, ఎంపీటీసీ సావిత్రి, తదితరులు పాల్గొన్నారు.

'సీఎం జిల్లా సమస్యలపై స్పందించాలి'


మాట్లాడుతున్న గోవింద్‌నాయక్

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లా పర్యటనకు వస్తున్న సీఎం కేసీఆర్ సమస్యలపై స్పందించాలని వైఎస్సార్‌టీపీ జిల్లా అధ్యక్షుడు భూక్య గోవింద్ నాయక్ డిమాండ్ చేశారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా ప్రజల అభివృద్ధి, సంక్షేమం తొమ్మిదేళ్లుగా పట్టించుకోని సీఎం హడావుడిగా జిల్లా పర్యటనకు రావడం వెనుక ఆంతర్యం ఏంటని ప్రశ్నించారు. గిరిజనులు అధికంగా ఉన్న ఉమ్మడి ఆదిలాబాద్ అభివృద్ధి సీఎం కేసీఆర్ పాలనలో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నట్లుగా ఉందన్నారు. గిరిజన యూనివర్సిటీని జిల్లా నుంచి తరలించి విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరం చేశారమని మండిపడ్డారు.

'జిల్లాలో చేసిన అభివృద్ధిపై మాట్లాడాలి'

కాగజ్‌నగర్‌టౌన్: స్వరాష్ట్రంలో తెలంగాణ ప్రభుత్వం చేసిన కుమురంభీం జిల్లాలో చేసిన అభివృద్ధి పనులపై ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడాలని తెలుగుదేశం పార్టీ ఉమ్మడి ఆదిలాబాద్ పార్లమెంట్ అధ్యక్షుడు గుల్లపల్లి ఆనంద్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. సిర్పూర్ నియోజకవర్గంలోని తుమ్మిడిహెట్టి వద్ద నిర్మించాల్సిన ప్రాణహిత- చేవెళ్ల ప్రాజెక్టును కాళేశ్వరానికి తరలించి ప్రజల నోట్లో మట్టికొట్టారని మండిపడ్డారు. ఈ నెల 30న జిల్లా కేంద్రానికి వస్తున్న సీఎం జిల్లాలో చేసిన అభివృద్ధిపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు.

తాటికమ్మల గుడిసెలోనే..!

- బతుకునీడుస్తున్న పేద కుటుంబం
- పశువులు మేపుతూ జీవనం
- ఇల్లు మంజూరు చేయాలని వేడుకోలు


తాటికమ్మల ఇంటి ఎదుట లస్మయ్య కుటుంబం

దహెగాం: వారిది నిరుపేద కుటుంబం. భార్యభర్తలిద్దరు పశువులు కాస్తూ జీవనం సాగిస్తున్నారు. ఇద్దరు పిల్లలకు పెళ్లిళ్లు చేయగా, మరో ఇద్దరు పిల్లలతో కలిసి తాటికమ్మలతో వేసుకున్న గుడిసెలో నివాసం ఉంటున్నారు. ఉండేందుకు కనీసం ఇల్లు కూడా లేకపోవడంతో వారి కష్టాలు వర్ణనాతీతంగా ఉన్నాయి. మండల కేంద్రానికి చెందిన బోరె లస్మయ్య, శోభక్కలకు నలుగురు సంతానం. ఇద్దరు కుమార్తెల పెళ్లిళ్లు అయిపోగా మరో కుమార్తె మల్లక్క, కుమారుడు రాజేశ్ బడికి వెళ్తున్నారు. కనీసం ఉండడానికి ఇల్లు కూడా లేకపోవడంతో కేజీబీవీ సమీపంలోని ప్రభుత్వ స్థలంలో తాటికమ్మలతో గుడిసె వేసుకొని నివాసం ఉంటున్నారు. గుడిసె చుట్టూ రక్షణకు కనీసం గోడ కూడా లేకపోవడంతో క్రిమి కీటకాలు గుడిసెలోకి వస్తున్నాయని, దీంతో రాత్రంతా బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నామని లస్మయ్య వాపోతున్నాడు. గుడిసెకు కరెంట్ సౌకర్యం కూడా లేకపోవడంతో రాత్రిళ్లు దీపం వెలుగుల్లోనే వారంతా కాలం గడుపుతున్నారు. అసలే వర్షాకాలం కావడంతో ఎటు నుంచి ఏం వస్తుందోనని భయాందోళన చెందుతున్నారు. కాగా లస్మయ్యకు 60 ఏళ్లు నిండినా ప్రభుత్వం నుంచి పింఛన్ కూడా అందడం లేదు. ప్రభుత్వం వారిని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

సీఎం పర్యటనకు భారీ ఏర్పాట్లు


సభాస్థలి వద్ద ఏర్పాటు చేస్తున్న వాటర్‌ప్రూఫ్ టెంట్

ఆసిఫాబాద్: సీఎం కేసీఆర్ జిల్లా పర్యటన నేపథ్యంలో అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. కలెక్టరేట్ రహదారికి ఇరువైపులా, డివైడర్లకు రంగులు వేసి శోభాయమానంగా తీర్చిదిద్దుతున్నారు. సీఎం సభాస్థలి వద్ద వాటర్‌ప్రూఫ్ టెంట్ ఏర్పాటు చేస్తున్నారు. సభకు అవసరమైన బస్సులు, వాహనాలు సమకూర్చుతున్నారు.


రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన ఇనుప కంచె

రోడ్డు మరమ్మతులు చేపట్టాలి


వినతిపత్రం అందజేస్తున్న తుడుందెబ్బ నాయకులు

తిర్యాణి: శ్రీ ఇన్‌క్లెయిన్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డుతో పాటు మండల కేంద్రం నుంచి కర్పతిగూడ గ్రామానికి వెళ్లే రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని బుధవారం తహసీల్దార్ కార్యాలయం సిబ్బందికి తుడుందెబ్బ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు వెడ్మ భగవంత్‌రావు మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రోడ్డంతా బురదమయంగా మారడంతో ప్రయాణికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంఘం డివిజన్ ఉపాధ్యక్షుడు గెడం సుభాశ్, మండల అధ్యక్షుడు ఆత్రం గోపాల్, నాయకులు బారిక్‌రావు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

చినుకు పడితే చిత్తడే..

కౌటాల: మండలంలోని బోదంపల్లి గ్రామంలో గల బీసీకాలనీ రోడ్డు చినుకు పడితే చిత్తడిగా మారుతోందని బీఎస్పీ జిల్లా నాయకులు రాంటెంకి నవీన్ అన్నారు. బుధవారం గ్రామంలోని బురద రోడ్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిని గాలికి వదిలేసిందన్నారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు గుడికందుల రమేశ్, కాలనీవాసులు ఉన్నారు.

మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలి

రెబ్బెన: రాంపూర్ గ్రామానికి మెరుగైన రోడ్డు సౌకర్యం కల్పించాలని డీవైఎఫ్‌ఐ మండల అధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో బురదమయంగా మారిన రాంపూర్ రోడ్డును బుధవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రోడ్డు కోసం ఎన్ని వినతిపత్రాలు అందించినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి శివ, మండల ఉపాధ్యక్షుడు వంశీ పాల్గొన్నారు.


కౌటాల: మాట్లాడుతున్న నవీన్


రెబ్బెన: బురదరోడ్డును చూపిస్తున్న నాయకులు

పాఠశాల తనిఖీ

నార్నూర్: వర్షాకాలం విద్యార్థులు ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని కస్తూర్బా గాంధీ పాఠశాల సెక్టోరియల్ జిల్లా అధికారి ఉదయ్‌శ్రీ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేశారు. గోదాంలోని నిత్యావసర సరుకులను పరిశీలించారు. విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని సూచించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్‌వో హిమబిందు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

నార్నూర్: ప్రభుత్వం రైతు ఖాతాలో రైతుబంధు డబ్బులు జమ చేసినందున అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఇమ్రాన్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని కుమురం భీం విగ్రహం వద్ద రైతులకు అవగాహన కల్పించారు. డబ్బులు తీసుకోవటానికి సీఎస్పీ సెంటర్, ఆన్‌లైన్ సెంటర్లకు వెళ్లినప్పుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. డబ్బులు తీసుకున్న తర్వాత రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

సాక్షి సినిమాలు

ఆసిఫాబాద్

కుమురంభీం	: ఆదిపురుష్

కాగజ్‌నగర్

వెంకటరమణ	: ఆదిపురుష్

\- ఆసిఫాబాద్‌అర్బన్

కూరగాయల ధరలు

కూరగాయలు	ధర(కిలో)
టమాటా	రూ.100
సిమ్లామిర్చి	100
దోసకాయ	60
చామగడ్డ	80
వంకాయ	60
బీరకాయ	100
కాకరకాయ	80
బెండకాయ	60
అలసంద	60
దొండకాయ	80
పచ్చిమిర్చి	120
పాలకూర	60
సొరకాయ	60
చిక్కుడు కాయ	100
గోబి(పూల్)	100
క్యాబేజి	60

\-ఆసిఫాబాద్‌అర్బన్

ఘనంగా జగన్నాథ రథయాత్ర

కాగజ్‌నగరరూరల్: కాగజ్‌నగర్ మండలంలోని నజ్రూల్‌నగర్ మార్కెట్ ఏరియాలో బుధవారం జగన్నాథ రథయాత్రను ఘనంగా నిర్వహించారు. స్థానిక గణేశ్ మందిరం నుంచి వేద మందిరం వరకు రథయాత్ర కొనసాగింది. రథయాత్రకు నజ్రూల్‌నగర్ పంచాయతీలోని పలు గ్రామాల ప్రజలతో పాటు సమీప గ్రామాల భక్తులు తరలివచ్చారు.

చిన్నారులకు చేయూత


సామగ్రి అందజేస్తున్న సభ్యులు

చింతలమానెపల్లి: మండలంలోని గూడెం గ్రామానికి చెందిన తల్లిదండ్రులు లేని చిన్నారులకు మాఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం చేయూతనందించారు. గ్రామానికి చెందిన దంపతులు పాలె సంతోష్ -మంగ దంపతులు ప్రమాదవశాత్తు గత ఏడాది మృతి చెందారు. దీంతో పిల్లలు శరణ్, శరణ్యలు బంధువుల వద్ద ఉంటున్నారు. వీరి చదువులకు అవసరమైన స్కూల్ బ్యాగ్స్, పుస్తకాలు, పెన్నులు, రెండు జతల బట్టలు, ఇతర సామగ్రిని మాఫౌండేషన్ తరఫున చిన్నారులకు అందజేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధి లోడెల్లి ప్రవీణ్ కుమార్, సభ్యులు జునుగరి శేఖర్, బొర్కుటి వెంకన్న, రాజమౌళి పాల్గొన్నారు.